క్లుప్తంగా

యాళ్లవానిగరువు సచివాలయంలో ఆధార్ కేంద్రం



సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్ : ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ యాళ్లవానిగరువు సచివాలయంలో గురువారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆనందప్రకాష్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా 10 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా ఇర్మియారాజు, నల్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా), సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పరివర్తనపై మహిళా పోలీసులకు అవార్డులు



మహిళా దినోత్సవంలో ప్రశంసా పత్రాలు అందుకున్న మహిళా పోలీసులు

పాలకొల్లు సెంట్రల్ : మహిళా దినోత్సవం పురస్కరించుకుని పట్టణానికి చెందిన మహిళా పోలీసులు అవార్డులు అందుకున్నారు. భీమవరం కలెక్టర్ కార్యాలయంలో పరివర్తన అనే అంశంపై బుధవారం మహిళా పోలీసులు ప్రదర్శన నిర్వహించి బహుమతులు అందుకున్నారు. మహిళా పోలీసులు శ్రీదేవి, జాహ్నవి, సౌమ్య, భానుప్రియ, అనిత జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ముమ్మరంగా చెరువు తవ్వకం పనులు



చెరువు తవ్వకం పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్ కుమార్

మొగల్తూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొగల్తూరులో బోడె చెరువు తవ్వకం పనులను అమృత్ సరోవర్ పథకంలో రూ 2.72 లక్షలతో చేపట్టారు. గురువారం ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్ ఈ చెరువు తవ్వకం పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమృత్ సరోవర్ పథకంలో చెరువును తవ్వడంతోపాటు గట్లు వెంబడిఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం, స్థానికులకు వాకింగ్ ట్రాక్‌ను సిద్ధంచేస్తున్నట్లు చెప్పారు.

కన్నయ్యకు వెండి చెంబు సమర్పణ



శ్రీకృష్ణ ఆలయంలో వెండి చెంబు అందజేస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్ : స్థానిక కెనాల్ రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో స్వామివారికి దాతలు వెండి చెంబు సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన వెన్నంరెడ్డి సత్తిరాజు, సుచిత్ర దంపతుల పేరున వారి స్నేహితులు, కుటుంబ సభ్యులు వచ్చి 203 గ్రాముల వెండి చెంబును గురువారం ఆలయ అర్చకునికి అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ కమిటీ సభ్యులు మన్నే శ్రీనివాస్, ఇయ్యపు భాస్కరరావు, ముగడ శ్రీనివాస్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీనియర్ సిటిజన్స్ అధ్యక్షునిగా వంగా

పాలకొల్లు సెంట్రల్ : పట్టణ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా వంగా నరసింహరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పట్టణ అసోసియేషన్ భవనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా వేగేశ్న తిరుపతిరాజు, ఉపాధ్యక్షులుగా కొల్లి నరసింహమూర్తి, జక్కంపూడి నరసింహరావు, కేవీఎల్ నరసింహరాజు, సెక్రటరీగా పీవీ ప్రతాప్ రాజు, ట్రెజరర్‌గా మాగం బాలకొండయ్య, సహాయ కార్యదర్శులుగా కారుమూరి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణమూర్తి, మరో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జిల్లా అధ్యక్షులు ఏఎస్ఎస్ సత్యనారాయణరాజు, జిల్లా కార్యదర్శి కె.చిట్టివెంకయ్య పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్.. సేవలు సూపర్

- విజయవంతమైన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం
- ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్న వైద్యసిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు



పడమటిపాలెంలో ఇంటికి వెళ్లి రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ దివ్యభారతి



వాహనంతో డాక్టర్, సిబ్బంది

మొగల్తూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతమైంది. గత ఏడాది అక్టోబర్ 22న ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇప్పటి వరకు మండలంలో 79 క్యాంప్‌లు నిర్వహించి సుమారు 8,600 మంది రోగులను పరీక్షించారు. నరసాపురం మండలంలోని తూర్పుతాళ్ళు, ఎల్‌బీచర్ల ఆసుపత్రుల పరిధిలో 150 క్యాంప్‌లు నిర్వహించి సుమారు 15,950 మంది రోగులను పరీక్షించారు. 104 వాహనంలో డాక్టర్, వైద్య సిబ్బంది తరలివెళ్లి సచివాలయాల పరిధిలోని ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షించి మందులు అందచేస్తున్నారు. నడవలేక ఆరోగ్య కేంద్రానికి రాలేనివారు, పక్షవాతంతో బాధపడుతున్న వారి ఇంటికి స్వయంగా డాక్టర్, వైద్యసిబ్బంది వెళ్లి రోగిని పరీక్షించి మందులు అందచేస్తుండటంతో రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లను పూర్తిస్థాయిలో నియమించడంతో ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోను, మరోకరు ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌లోను విధులు నిర్వహించడంతో రోగులకు అందుబాటులో ఉంటున్నారు. మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14 సచివాలయాలు, నరసాపురం మండలంలోని 28 సచివాలయాల పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సేవలందిస్తున్నారు. రోగులకు సంబంధించి సుమారు 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ దివ్యభారతి తెలిపారు.

ఈనెల 15 నుంచి పూర్తిస్థాయిలో వైద్య సేవలు

ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతం కావడంతో ఈనెల 15 నుంచి పూర్తిస్థాయిలో గ్రామాల్లో వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించడంతో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరోగ్య కేంద్రంలో ఉంటూ వైద్య సేవలు అందించడమే కాక పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలను కూడా సందర్శించి విద్యార్థులను, చిన్నారులను పరీక్షించి మందులు అందచేస్తారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం భేష్



ఫ్యామిలీ డాక్టర్ విధానం బాగుంది. ఇంటింటికి వెళ్లి రోగులను పరీక్షించడం ద్వారా అనేక విషయాలు తెలుసుకుంటున్నాం. స్వయంగా ఓ డాక్టర్ రోగి ఇంటికి వెళ్లి పరీక్షించడంతో వారు కూడా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15 నుంచి రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటూ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తాం.
– డాక్టర్ ఒ. దినేష్

రోగులకు వరం



నాకు బీపీ పెరిగి పక్షవాతం వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న నన్ను ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్, సిబ్బంది ఇంటికే వచ్చి నన్ను పరీక్షించడం, మందులు ఇవ్వడం చేస్తున్నారు. ప్రభుత్వ డాక్టర్ ఇంటికి వచ్చి పరీక్షించడమనేది నాకు తెలిసి ఇదే మొదటి సారి. నా లాంటి రోగులకు ఇదోక వరం లాంటిది.
– కుక్కల త్రినాథరావు, కుక్కల వారితోట

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం : నరసాపురం మెయిన్ సబ్‌స్టేషన్‌లో చేపట్టిన మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ బళ్ల సురేష్ చెప్పారు. రుస్తుంబాద రూరల్, లక్ష్మణేశ్వరం, ధర్బరేవు, సరిపల్లి, ఇఖితపూడి, తూర్పుతాళ్లు, కాపుల కొడప, సర్దుకొరడప, వేములదీవి, చినమైనవానిలంక, పెదమైనవానిలంక గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

మొగల్తూరు : మండలంలోని మూడు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బళ్ళసురేష్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నరసాపురంలో ఓటు వేయాలి

పాలకొల్లు అర్బన్ : మండలంలోని ఎంపీటీసీ సభ్యులు ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా నరసాపురం వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మొగల్తూరు రోడ్డులో సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో పాలకొల్లు మండల ఎంపీటీసీ సభ్యులు ఓటు వేయాలని ఆయన చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య ఓటు వేయవచ్చునన్నారు. ఓటు వేయడానికి వెళ్లే ముందు పాలకొల్లు ఎంపీడీఓ కార్యాయానికి వచ్చి ఎంపీటీసీ ఐడెంటిటీ కార్డు, ఓటరు స్లిప్ తీసుకెళ్లాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



రోడ్డు పనులు పరిశీలిస్తోన్న మున్సిపల్ చైర్‌పర్సన్

నరసాపురం : పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ సూచించారు. గురువారం పట్టణంలోని 30వ వార్డు గ్రేస్‌నగర్‌లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.48 లక్షలతో జరుగుతున్న రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి రోడ్లు, డ్రెయినేజీలు అభివృద్ధి పరుస్తున్నామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామల, అడిదల శరత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సమైక్యతా శిబిరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పొన్నపల్లి శ్రీరామారావు

నరసాపురం : స్థానిక వైఎన్ కళాశాలలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న జాతీయ సమైక్యతా శిబిరం గురువారంతో ముగిసింది. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ సేవా పథకం ప్రాంతీయ కన్వీనర్, వైఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహించారు. 12 రాష్ట్రాలకు చెందిన 212 మంది విద్యార్థులు, జాతీయసేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్లు శిబిరంలో పాల్గొన్నారు. సేవా తత్పరత, శ్రమదానం, వివిధ రాష్ట్రాల ఆచార వ్యవహారాలు, భాష, సంప్రదాయాలు, సంస్కృతులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొన్నపల్లి శ్రీరామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు, డీన్ గంధం రామకృష్ణ, హెచ్‌ఆర్డీ సెంటర్ కన్వీనర్ డాక్టర్ చినిమల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలూ.. అవరోధాలను అధిగమించాలి



కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ డీజీఎం శ్రీరామారావు

పాలకొల్లు సెంట్రల్ : నేటి సమాజంలో ఎదురవుతున్న అవరోధాలను మహిళలు అధిగమించాలని, తోటి వ్యక్తుల సహకారంతో ముందుకు వెళుతూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సీహెచ్ ఉమాశర్మ అన్నారు. గురువారం స్థానిక బీఆర్‌ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశర్మ, డాక్టర్ కుసుమ కుమారిలను సన్మానించారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం శ్రీరామారావు ఆధ్వర్యంలో కళాశాలకు రెండు కంప్యూటర్లను బహూకరించారు. కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షులు కేవీఆర్ నరసింహరావు, కళాశాల ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓల్గా, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఏబీఎస్ మూర్తి, కళాశాల సభ్యులు వినుకొండ రంగారావు, కంచర్ల వీర్రాజు, నూలి బాబ్జి, డాక్టర్ వర్మ, కామేశ్వరరావు, చల్లా సత్యనారాయణ, చల్లా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ఆలయంలో పూజలు చేస్తున్న రాజేంద్రన్ దంపతులు

పెనుగొండ : శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాల సందర్భంగా కోయంబత్తూరు వాసవీ తిరుప్పణి కమిటీ అధ్యక్షుడు రాజేంద్రన్ దంపతులు, ఆలయ చైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావు దంపతులు శాంతి హోమాలు, వాస్తు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోశాలలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ చేశారు. తొలుత తెల్లవారుజామున 4.30 నుంచి హోమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉదయం 6.50కు ధ్వజస్తంభ యంత్ర పూజ, ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. ఆలయ కార్య నిర్వహణాధికారి గోవరపు సత్య సూర్య శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కనకదుర్గమ్మ జాతర ప్రారంభం



అమ్మవారికి తొలి పానకం కావిడి సమర్పిస్తున్న దృశ్యం

యలమంచిలి : అడవిపాలెం గ్రామంలో ఉగాది సందర్భంగా నిర్వహించే గ్రామదేవత కనకదుర్గమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యా యి. గ్రామ ఆచారం ప్రకారం అమ్మవారి పుట్టింటి వంశపారంపర్య ధర్మకర్తలు పొట్టుపోతు నాగ లక్ష్మణ శ్రీనివాసరావు-వెంకట నాగమణి, అడబాల రాజేష్-విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి తొలి పానకం కావిడి, సారె, చీర సమర్పించి గ్రామో త్సవంగా అమ్మవారిని పుట్టింటికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. నేటి నుంచి అమ్మవారి ఘటాలకు రోజు విడిచి రోజు గ్రామోత్సవం చేస్తారు. ఈనెల 21న గ్రామానికి పడమర వైపున జాతర, 22న తూర్పు వైపు జాతర నిర్వహించి 23న ఊయల సేవతో అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయని మెట్టినింటి వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని గాంధీ తెలిపారు.

సాగునీరందకపోతే తెలపండి

భీమవరం అర్బన్: దాళ్వా సాగులో ప్రస్తుతం వంతులవారి విధానం అమలులో ఉందని, పంట పొలాలకు సాగు నీరందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులను కోరారు. భీమవరంలోని చినఅమిరం, రాయలం, కొమరాడ గ్రామాలలోని వరి పొలాలను గురువారం ఏవో నిమ్మల శ్రీనివాస్ పరిశీలించారు. వంతులవారీ విధానంలో సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షేమంతో అడుగడుగునా నీరాజనం

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు
- సిద్ధాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం



సిద్ధాంతంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ : ఎన్నికల హామీ నవరత్నాలతో పాటు, ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేయడంతో రాష్ట్రంలో ప్రజలు అడగడుగునా నీరాజనం పలుకుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం సిద్ధాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ప్రతి ఇంటికి ధైర్యంగా వెళ్లి సంక్షేమాన్ని వివరిస్తున్నామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని వెనుతిరగకుండా అమలు చేయడంతో సీఎం జగన్‌పై ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. కరోనాతో రాష్ట్ర ఆదాయం తగ్గినా వెనుకడుగు వేయకుండా సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. అమ్మ ఒడి పథకంతో పేదలకు కార్పొరేట్ విద్యను చేరువ చేశారన్నారు. అదేవిధంగా ప్రతి పేదవాని సొంతింటి కల నెరవేర్చడానికి సీఎం వైఎస్ జగన్ ఇంటి స్థలాలు అందించడంతోపాటు, గృహరుణాలు అందించి పేదల ఆశయాలు నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), యర్రంశెట్టి బుజ్జి, కోట సరోజనీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి శ్రీరాములు, రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు, కర్ని బత్తుల కార్పొరేషన్ డైరక్టరు అందే నాగ బసవన్న, సొసైటీ చైర్‌పర్సన్లు బలువు కృష్ణమూర్తి, కేశవరపు గణపతి, మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి (బాబీ), ఆచంట అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, సిద్ధాంతం అధ్యక్షుడు జుత్తిగ దామోదర్, పెనుగొండ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భీమవరం చేరిన ఓటర్ల చైతన్య పాదయాత్ర



అడబాల దుర్గ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పాలకొల్లు నుంచి మచిలీపట్నం వరకు ఓటర్ల చైతన్య పాదయాత్ర చేస్తున్న అడబాల దుర్గ ప్రసాద్‌కు భీమవరం బుధవారం మార్కెట్ సెంటర్‌లో పట్టణ ప్రముఖులు నాయకులు ఘన స్వాగతం పలికారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాజ శ్రేయస్సుకు కొన్ని చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ స్ఫూర్తితో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని దుర్గాప్రసాద్ పాలకొల్లు నుంచి చేస్తున్న పాదయాత్ర విజయవంతం కావాలని అన్నారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఓటును అమ్ముకోకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, నిస్వార్థమైన పాలకుడిని ఎన్నుకోవడానికి ఓటు ఒక వజ్రాయుధమని అన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పాలకొల్లు, భీమవరం, గుడివాడ, మచిలీపట్నం వరకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నానని తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అనిల్ కుమారి

నరసాపురం రూరల్ : రైతులకు నాణ్యమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించి నాణ్యమైన ఉత్పత్తులు సాధించేలా ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ ఏడీ అనిల్‌కుమారి పేర్కొన్నారు. గురువారం నరసాపురం సబ్ డివిజన్ పరిధిలోని నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు మండలాలకు చెందిన వ్యవసాయ, పండ్ల తోటల సహాయకులకు నరసాపురం రైతు భరోసా కేంద్రంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాలలోని కియోస్క్‌ల ద్వారా మేలైన విత్తనాలు, ఎరువులను అందించాలని ఆమె సూచించారు. విధిగా వైఎస్సార్ యాప్ ద్వారా ప్రతిరోజూ చేసిన పనులను అప్‌లోడ్ చేయాలన్నారు. వంతుల వారీ విధానంలో నీటిని సరఫరా చేసే వంతు తేదీలపై రైతులకు అవగాహన కల్పించి ఎటువంట ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అవసరమైతే టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండి రైతు సమస్యలను పరిష్కరించాని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు శామ్యూల్ జాన్సన్, దేవి, సుజాత, హబ్ మేనేజర్ సత్యానందం, ఏఈవోలు లక్ష్మీనారాయణ, జోషీలా, ఆర్బీకే సహాయకులు పాల్గొన్నారు.

యూరీ గగారిన్ జయంతి

భీమవరం(ప్రకాశం చౌక్): అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి మానవుడు, శాస్త్రవేత్త యూరీ గగారిన్ జయంతిని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలో గురువారం నిర్వహించారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ యూరీ గగారిన్ రష్యా దేశస్తుడని, 1961లో గగారిన్ మొట్టమొదటి వ్యోమగామి అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ అంతరిక్ష నౌకలో భూమి చుట్టూ తిరిగేప్పుడు, మన గ్రహం ఎంత అందమైనదో, ఈ అందాన్ని కాపాడుకుని, పెంపొందిద్దాం, నాశనం చేయొద్దు అని యూరీ గగారిన్ తన రాసిన పుస్తకం ద్వారా తెలియజేసారని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, టైలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రామ కోటేశ్వరరావు, కొండ్రు శ్రీనివాస్, దివ్య సందేశ సంస్థ అధ్యక్షురాలు ఎండి సరోజినీ, అడపా సత్యవతి పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



వసంతలక్ష్మిని సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

పాలకొల్లు అర్బన్ : విద్యారంగంతో పాటు సామాజిక రంగాలకు సేవలందిస్తున్న ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్ ప్రిన్సిపాల్ సామవేదం వసంతలక్ష్మిని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సత్కరించారు. వసంతలక్ష్మి లయన్స్ ఫెమినా క్లబ్‌ను నూతనంగా స్థాపించి ఆ సంస్థకు ప్రథమ అధ్యక్షురాలుగా ఉంటూ పలు సామాజిక సేవలందిస్తున్నారు. అలాగే డీఆర్‌డీఏ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న కలిగితి జ్యోతిరాణిని కూడా కలెక్టర్ ప్రశాంతి సత్కరించారు.

చలో ఢిల్లీకి తరలిరావాలి

పాలకోడేరు: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అప్రియ కోరారు. శృంగవృక్షం, పెన్నాడ గ్రామాల్లో గురువారం చలో ఢిల్లీపై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.